అటకెక్కిన రెవెన్యూ పాలన

- కొద్దినెలలుగా జగ్గయ్యపేట, వత్సవాయి తహసీల్దార్ పోస్టులు ఖాళీ..
- భర్తీకి నోచుకోని పోస్టులు
- ఇన్‌చార్జిలతోనే నడిపిస్తున్న వైనం
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడింట రెండు మండలాల్లో రెవెన్యూశాఖ దుస్థితి ఇది

జగ్గయ్యపేట/వత్సవాయి: జగ్గయ్యపేట, వత్స వాయి మండలాల తహసీల్దార్ పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉండటంతో ఈ మండలాల్లో రెవెన్యూ పాలన అటకెక్కింది. ఆయా పోస్టులు భర్తీకి నోచుకోకపోతుండటంతో ప్రజలకు పలుర కాల రెవెన్యూ సేవలు పూర్తిగా నిలిచిపోగా, మరి కొన్ని సేవలు అరకొరగానే అందుతున్నాయి. మండలస్థాయిలో కీలకమైన తహసీల్దార్ పోస్టు నెలల తరబడి భర్తీకి నోచుకోకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం మూడు మండలాలు ఉండగా రెండు మండలాలకు తహసీల్దార్లు లేకపోవడం గమనార్హం.

ఇన్‌చార్జి తహసీల్దార్లే దిక్కు..

జగ్గయ్యపేట తహసీల్దార్ శేషగిరి బదిలీ తర్వాత ఆ పోస్టు సుమారు ఏడాదిగా ఖాళీగా ఉంది. తొలుత డీటీ నీలం నాగరాజు, ఆయన బదిలీతో ప్రస్తుత డీటీ మనోహర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వత్సవాయి తహసీల్దార్ ఎస్.నర సింహారావు ఉద్యోగోన్నతిపై ఐదునెలల కిందట బదిలీకావడంతో డీటీ కె.ప్రభుకుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇన్‌చార్జి తహసీల్దార్లు పూర్తిస్థాయి తహసీల్దార్ల మాదిరిగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో రెవెన్యూ సేవలకు అంతరాయమేర్పడుతోంది. ఆయా రెవెన్యూ అంశాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయేమోననే సందేహాలతో ఆయా ఇన్‌చార్జులు పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించలేకపోతుండటం ప్రజలకు కొంతమేర ఇబ్బందిగా మారుతోంది.



ఆయా పనులపై వచ్చి వత్సవాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

అధికారులకు కోటరీల సెగ..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో అధికారపార్టీలో మూడు కోటరీలు ఉండటం కూడా అధికారులు తలనొప్పిగా భావిస్తున్నారు. ఈ మూడు కోటరీల్లో ఒకరు నియోజకవర్గ ప్రజాప్రతినిధికాగా, మరొకరు సీఎం చంద్రబాబు వద్ద చక్రం తిప్పగల మాజీ ప్రజాప్రతినిధి. ఇంకొకరు జిల్లాపార్టీ పెద్దగానే కాకుండా ఇటీవలే జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవీ బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో రాజకీయాలు నడుపుతున్నారు. ఈ మూడు కోటరీల వ్యవహారశైలి కూడా ఇక్కడి తహసీల్దార్ పోస్టులు సకాలంలో భర్తీగాక పోవడానికి పరోక్ష కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కోటరీల కారణంగా తహసీల్దార్‌గా వచ్చేందుకు అధికారులెవ్వరూ ఆసక్తిచూపడం లేదని సమాచారం. ఈ వర్గ రాజకీయాల కారణంగా ఇప్పటికే అధికారులకు ఇబ్బందులు ఎదురవుతుండగా, మా వర్గానికి కాకుండా మరొకరికి పనిచేస్తే ఇబ్బందులుపడతారంటూ ఆయా కోటరీలు ఝలక్‌లు ఇస్తుండటం అధికారులకు తలనొప్పిగా మారింది. ఇక ఈ మూడు కోటరీలకు తోడు కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన జనసేనలో చేరి జిల్లా అధ్యక్షుడైన తాజా మాజీ ప్రజాప్రతినిధి కూడా నాలుగో కోటరీగా వ్యవహరిస్తూ తన వర్గ ప్రయోజనాలు కూడా ముఖ్యమేనని స్పష్టం చేస్తుండటంతో ఏమిచేయాలో పాలుపోక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇచ్చిన పోస్టింగ్ రద్దు!..

సీఎం చంద్రబాబుకు సన్నిహితుడిగా వ్యవహరిస్తున్న మాజీప్రజాప్రతినిధి వారం రోజుల కిందట నందిగామ మండలానికి చెందిన ఓ వ్యక్తికి సిఫార్సు లేఖ ఇవ్వడంతో ఆవ్యక్తి వత్సవాయి తహశీల్దార్‌గా జాయిన్ అయ్యేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి తన అనుమతి లేకుండా ఎలా జాయిన్ అవుతారంటూ వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సదరు వ్యక్తికి ఇచ్చిన పోస్టింగ్‌ను నిలుపుదల చేయించినట్లు రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీంతో డీటీనే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్నారు. అధికార కూటమిలోని నాయకుల పెత్తనాన్ని తట్టుకోలేక తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చేందుకు పలువురు నిరాసక్తత వ్యక్తంచేస్తుండగా, ఇచ్చిన పోస్టింగ్‌లు రద్దు చేయించడం వంటి ఘటనలు తహసీల్దార్లు, ఉద్యోగులు ఇక్కడ సజావుగా పని చేసే పరిస్థితి లేకుండా చేస్తున్నాయనే విమర్శలకు ఊతమిస్తున్నాయి. ఇకనైనా పాలకులు స్పందించి జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల తహసీల్దార్ పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పైరవీకారులదే హవా..

వత్సవాయి, జగ్గయ్యపేట మండలల్లో తహసీల్దార్ పోస్టులు కొద్దినెలలుగా భర్తీకి నోచుకోకపోవడంతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసే అంశంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. అదేవిధంగా ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు పెట్టుబడులు కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అడంగల్‌లో పేరు తప్పులు, విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్‌లో భూమి వివరాలు చూపించడంలేదనే కారణాలు చూపిస్తూ బ్యాంకు సిబ్బంది కొర్రీలు పెడుతున్నారు. తహసీల్దార్‌తో సరిచేయించుకుని తీసుకువస్తే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు సిబ్బంది చెబుతుండటంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల వైపు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడ తహసీల్దార్ లేరని చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇదే అదనుగా కొంతమంది పైరవీకారులు రెవెన్యూ విభాగంలో తమ పనులను చక్కపెట్టుకుంటున్నారనే ప్రచారం రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా పైరవీలు చేసే సదరు నాయకులకు పలువురు వీఆర్వోలు కూడా వంతపాడుతూ తమసహకారం అందిస్తున్నారని సమాచారం. ఇక సదరు పైరవీకారులు నిబంధనలకు విరుద్ధమైన పనులను సైతం చేయాలంటూ అధికారులపై వత్తిడి చేస్తూ, ఆయా పనులు చేయకపోతే సదరు అధికారులపై ఉన్నతాధికారులకు ఆకాశరామన్న ఉత్తరాలు రాస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడిన ఘటనలు కూడా గతంలో ఇక్కడ చోటుచేసుకోవడం గమనార్హం.

కూటమితోనే గ్రామాభివృద్ధి: ఎమ్మెల్యే

చందర్లపాడు(నందిగామటౌన్): కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలంలోని కాండ్రపాడు గ్రామంలో రూ.13లక్షలతో బ్రహ్మబొట్లవారిపాలెంలో రూ. ఐదు లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. అనంతరం బీజేపీ 11 ఏళ్ల సుపరిపాలనపై రూపొందించిన కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కోట వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

26 నుంచి వారాహి అమ్మవారి ఉత్సవాలు

కంచికచర్ల: స్థానిక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఈనెల 26వ తేదీ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కాకాని పవన్‌కుమార్‌శర్మ శుక్రవారం తెలిపారు. ఆషాడ మాసం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వివరించారు. నవరాత్రి ఉత్సవాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

విలీనంపై పునరాలోచన చేయాలని డిమాండ్

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): విలీన పాఠశాలల అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ బైరవబోయిన బాబు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో తల్లిదండ్రులు, విద్యా కమిటీ చైర్మన్‌లకు కనీస సమాచారం అందించకుండా అధికారులు ఇష్టారీతిన వ్యవహరించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వ తీనే విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



నందిగామరూరల్: మండలంలోని గోళ్ల మూడిలో వేంచేసి యున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి వారి ఆలయ 18వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు బాలశాస్త్రి, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, రక్షాబంధనం, 108 కల శాల పూజ, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామ పూజలను వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ చావా అర్జునరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.13వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి శుక్రవారం బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన గుంజి కోటేశ్వరరావు, వెంకటరత్నం దంపతులు రూ.13.001 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు, పాలిది వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. విరాళం నగదును అమ్మవారి భర్త గోపయ్యస్వామి బంగారు తలపాగా తయారీకి వినియోగించాలని కోరారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



నందిగామరూరల్: విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. మండలంలోని చందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన బూట్లు, బ్యాగులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగలక్ష్మి, రాజేంద్రబాబు, విజయ్‌కుమార్, అహ్మద్ ప్యారా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరోగమనంలో విద్యారంగం : తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో విద్యారంగం తిరోగమనంలో పయనిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల విలీనం పేరుతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో17 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చారన్నారు. ఈ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిది తరగతులను రద్దు చేయడంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థులు కనీసం పది కిలోమీటర్ల దూరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సివస్తోందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యాశాఖ అధికారుల తప్పుడు నివేదికల కారణంగానే ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు 60మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా మార్చాలన్న నిబంధనలను అమలుచేస్తే జగ్గయ్యపేట మండలంలోని అగ్రహారం యూపీ స్కూల్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యేదన్నారు. ఆదిశగా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. హైస్కూల్‌కు మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉండే యూపీ స్కూళ్లను కొనసాగించాలనే నిబంధనను కూడా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు, పాలకుల తీరు కారణంగా అన్నవరం, తక్కెళ్లపాడు, వేదాద్రి, రావిరాల, అగ్రహారం, ధర్మవరప్పాడు తండాల్లోని విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు ఖాళీ లేవంటూ నో వేకెన్సీ అనే బోర్డులు పెట్టిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తుచేశారు. ఇకనైనా పేదల చదువులు కొనసాగేలా కూటమి పాలకులు తగిన నిర్ణయాలు తీసుకుని యూపీ స్కూళ్లను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం పరిశీలించారు. వేడుకల్లో పాల్గొనే విద్యార్థులు, అధికారులు, ప్రజల కోసం చేస్తున్న తాగునీటి సౌకర్యం, వైద్య, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ యోగా శరీరానికి, మనస్సుకు ప్రశాంతతను అందించే గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు.ఈ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు, డీసీ చైర్మన్ ఏలూరు గోపాలరావు, తాళ్లూరు ఎంపీటీసీ బొల్లా వెంకటేశ్వరరావు, షేక్ షరీఫ్, చెన్న బాలకృష్ణ, కట్టా నవీన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పేట మార్కెట్ యార్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



నందిగామ జెడ్పీ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ పట్టణంలో..

నందిగామ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ వెయ్యి మందికి పైగా పాల్గొనేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యోగా సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ లోవరాజు, తహసీల్దార్ సురేష్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

నందిగామటౌన్: పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవ కేక్‌ను ఆర్డీవో బాలకృష్ణ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతి క్షణం ప్రజా సేవలోనే ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విపత్తులు, అత్యవసర సమయాలలో రెవెన్యూ సిబ్బంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తున్నారని వివరించారు. అనంతరం రెవెన్యూ శాఖ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో రెవెన్యూ దినోత్సవ కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ



కంచికచర్లలో రిటైర్డ్ ఉద్యోగి గోపయ్యను సత్కరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకటరెడ్డి



వీరులపాడులో రిటైర్డు అటెండర్ మోహనరావును సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మానస మాట్లాడుతూ ప్రజాసేవలో రెవెన్యూ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గోపయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరెడ్డి వీఆర్వోలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: జుజ్జూరులోని మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ దినోత్సవ కేక్ కట్ చేశారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అటెండర్ మోహనరావును ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.నాగరాజు, వీఆర్వోలు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

విలీన పాఠశాలలను సందర్శించిన డీవైఈవో



ధర్మవరప్పాడుతండాలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీవైఈవో సాంబశివరావు

జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడుతండ, రావిరాల, వేదాద్రి, తక్కెళ్లపాడు, కెఅగ్రహారం, అన్నవరం గ్రామాల్లోని విలీన పాఠశాలలను నందిగామ ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధర్మవరప్పాడుతండ గ్రామంలోని మంచిగా ఉన్న పాఠశాలలను విలీనం చేయాల్సిన అవసరమేంటని తల్లిదండ్రులు డీవైఈవోను ప్రశ్నించారు. ఎంఈవో ఏకపక్ష నిర్ణయంతోనే పాఠశాలల్లోని తరగతులను తొలగించారని వారు డీవైఈవో దృష్టికి తీసుకువచ్చారు. మా గ్రామాల్లోని పాఠశాలల్లోనే ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను పునరుద్ధరిస్తేనే పిల్లలను బడులకు పంపుతామని, లేనిపక్షంలో చదువులు ఆపించి కూలీ పనులకు తీసుకెళ్తామని డీవైఈవోకు వివరించారు. తక్కెళ్లపాడు నుంచి షేర్‌మహ్మద్‌పేట వెళ్లాలంటే 10కి.మీలు జాతీయ రహదారిపై ప్రయాణించాల్సి ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కెఅగ్రహారం నుంచి విద్యార్థులు ముక్త్యాల వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. డీవైఈవో మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై తరగతులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాది పునః పరిశీలన చేస్తామని తెలిపారు. అవసరమైతే రవాణా చార్జిలు ప్రభుత్వం భరాయించేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని వివరించారు.

యోగా సాధనతో మానసిక ఆరోగ్యం

నందిగామరూరల్: యోగా సాధన మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కొద్దిసేపు యోగా సాధన చేయాలన్నారు. ముఖ్యంగా యోగా సాధనతో మానసిక ఆందోళన, ఒత్తిడి తగ్గటంతోపాటు ప్రశాంతత లభిస్తుంద ని వివరించారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు, ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో యోగా గురువు సీతారామారావు, యోగాంధ్ర కోఆర్డినేటర్లు కృష్ణమోహన్, కవిత,విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి : కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో శనివారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.తులసి వెంకటకృష్ణారావు కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరుకానున్నట్లు తెలిపారు. యోగా డే కార్యక్రమంలో సచివాలయ, మెప్మా సిబ్బంది, ఆశావర్కర్లు, అన్ని శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కంచికచర్ల తహసీల్దార్‌గా నరసింహారావు

కంచికచర్ల: మండల తహసీల్దార్‌గా సీహెచ్ నరసింహారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తూ కొంతకాలంగా సెలవులో ఉన్న ఆయనను కంచికచర్ల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. నరసింహారావు గతంలో కంచికచర్ల ఆర్ఐ, పీడీఎస్ డీటీగా పనిచేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహారావుకు డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకటరెడ్డి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.



సీహెచ్ నరసింహారావు